# ముగలి-ముగ్గు

దాసరి వక్కాణి
ఏ. నాగరత్న కుమారి

"మొగలిరేకులాంటి మొగుడీనీయవే" అని పాడుకుంటూ వస్తున్నాడు రవి. బస్సు ప్రయాణంలో అలసి పోయిన ముఖం, భుజాన ఎయిర్‌బాగ్, పొద్దున్నే ముగ్గులేస్తున్న మధుబాల వెనక్కి తిరిగి చూసింది. అతన్ని చూడగానే ఆమె హృదయం గతి తప్పింది.

"అదేం పాట? ఇప్పుడేనా ఊరినుంచి రావటం" అంది తెప్పరిల్లి.

"ఇప్పుడే" అన్నాడు రవి ఆమెవేస్తున్న ముగ్గు వంక చూస్తూ.

"ఎంతసేపే ఆ ముగ్గులు. పిండంతా వులకంటే అతి పోతున్నావు "అని తల్లి ఇంట్లోనుండి కేకేసింది.

"వస్తున్నా, అయిపోయింది" అని ముగ్గుబుట్ట పట్టుకులేచింది మధుబాల.

"ఇవాళ కనుమ కదా. మీకు ఈ రోజూ పండగే అనుకుంటాను " అంది అతనితో.

" అవును కనుమ రోజు బయలు దేరగూడదు. అందుకని నిన్నే బయలు దేరతీయించింది అమ్మ" అన్నాడతను.





"వస్తాను"

"వుండు" అంటూ భుజానవున్న బాగులోనుండి మొగలి రేకుల గుత్తినందించాడు రవి. మొగలిరేకుల సౌరభం, పరిమళం వాతావరణమంతా నిండిపోయింది.

"అమ్మో, ఇన్ని రేకులా" అంది మధు మురిసిపోతూ

" మా ఊళ్ళో అన్నీ మొగలి పొదలే" అన్నాడు రవి.

"అబ్బ గుచ్చుకుంది" అంది మధు, అతని చేతిలోనుండి మొగలి రేకులనందుకునేటప్పుడు రేకుల చివర ముళ్ళు గుచ్చుకోగా.

"మరి జాగ్రత్త. అలా కాదు, ఇలా పట్టుకోవాలి" అని ఆమెకు చూపించి తనగది తాళం తీసుకుని లోపలికి వెళ్ళిపోయాడు రవి.

ఇంట్లోకి పోయి తల్లికిచ్చింది మొగలిరేకులను "రవి తీసుకొచ్చాడంటూ"

"అబ్బ! ఎంత సువాసనే, అమ్మా మొగలి పొదల్లో మిన్నాగులుంటాయట కదా! నిజమేనా? " అడిగింది తల్లిని మధుబాల చెల్లెలు నాన్సీ.

"అవునట, సువాసనకు చేరతాయట" అంది తల్లి. ముగ్గు బుట్ట స్టోర్ రూం కిటికీలో పెట్టి స్నానానికి బయలు దేరింది మధుబాల. రవిని చూస్తే ఆమె మనస్సు విహ్వలమై పోతుంది. అతన్ని చూడాలనీ, అతనితో మాట్లాడాలనీ ఆమె తనువూ, మనసూ ఉవ్విళ్ళూరుతాయి. అతడి రూపం – సన్నగా, పొడుగ్గా, పచ్చటి రంగులో, నల్లటి గుబురు మీసాలతో, సుదుటపడే జుట్టుతో, కాస్తంత పొగరుగా, అధికారస్వరంతో మాట్లాడే అతను అపురూపంగా వుంటాడు ఆమెకు. అతని మాటలు అమృతధారల్లా, అతని ప్రతివనీ అందంగా వుంటాయి ఆమెకు. ఎక్కువసేపు నిటబడితే చురుక్కుమనేటట్లు వుండే చలికాలపు ఎండలా వెచ్చగా వుంటాడతను. మొగలిరేకుముల్లు గుచ్చుకునేటట్లు గరుసుగా వుంటాడతను ఆమెకు.

కృత్రిమమైన మర్యాదలంటే అతనికిగిట్టవు.

"ఇదిగో ... నీ పేరేంటి?" అని అడిగాడతను ఆమెతో మాట్లాడిన మొదటి రోజే, కాలేజీకి వెళ్తాంటే ఆమెవెనగ్గానడుస్తూ.

ఆమె వెనక్కితిరిగి చూసింది. తమ ఇంటిముందు గదిలో అద్దెకుండే బాచలర్. అంతవరకు చూపులు ఊహాల్లో తేలిపోవటాలేగాని మాటల్లేవు.

"మధుబాల" అంది సంభ్రమంగా.

"పేరుబాగుంది" అన్నాడతను

" మీ పేరు"

"రవి"

అతని పేరూ నచ్చింది ఆమెకు. ఆమాట పైకవలేదు.

"కాలేజీలో ఏం చదువుతున్నావు?"

"బి.యస్.సి. రెండోఏడు"

"షీర్ వేస్ట్ ఆఫ్ టైం అండ్ ఎనర్జీ"

"అదేంటి?"

"ఇంత అందమైన ఆడపిల్ల చదువుకోసం ఇంతగా శరీరాన్ని రొమ్ము పెట్టుకోవటం నాకు నచ్చలేదు."

ఇవేం భావాలు? మధుబాలకు ఆశ్చర్యమనిపించింది. అతని మాటలు వింటూంటే తనకు కోపం రావటంలేదే?

**మీకు తెలుసా ?**

12 సం॥ లు వయస్సు గల వైరుషోయాంగ్ అను చైనా బాలునకు విచిత్రమైన నేత్రములు కలవు. అతడు గోడ అవతలనున్న వస్తువులను కూడా చూడగలడు.



ఈ మాటలెవరయినా అంటే తనుపూర్కునేదా?

"అంటే అందంలేని ఆడపిల్లలు చదువుకోవచ్చన్నమాట" అంది.

"అసలు ఆడపిల్లలకు పెద్ద చదువులు అనవసరం.

"షటప్" అనాలనిపించింది ఆమెకు కాని విచిత్రం – అనలేకపోయింది.

ఇలాగే ఓసారి చర్చికి వెళ్ళున్నప్పుడు–

"చర్చికి వెళ్తున్నాం వస్తావుటయ్యా!" అని అడిగాడు అతన్ని ఆమెతండ్రి పాల్ప్రభాకర్.

"నేం హిందువులం రావచ్చునా?"

"ఆ ( ఆ ( రారా. చూద్దువుగానీ. మా ఆచారాలు, మతం అంటే ఏమిటో నీకూ తెలుస్తుంది.

తల్లి, తండ్రీ, చెల్లెలూ, తమ్ముడూ ముందునడుస్తున్నారు. మధుబాల రవి కబుర్లు చెప్పుకుంటూ వెనగ్గా వస్తున్నారు. అతను తమ ఇంట్లో అద్దెకు దిగినప్పటి నుండి ఆమెకు అలంకరణమీద శ్రద్ధ పెరిగిపోయింది. ఆరోజు చూడీదార్ వేసుకుని వచ్చింది. గులాబీ రంగులో చక్కగా నప్పినట్లనిపించింది తన డ్రస్ ఆమెకు.

"ఈ చూడీదార్లు ఎందుకేసుకుంటావు. నిక్షేపంగా చీరెలు కట్టుకోరాదూ? చీరలో ఆ అందమే వేరు,"

"నాకివే బావుంటాయి" అంది ఆమె

"ఈ డ్రస్‌లో పొట్టిగా కన్పిస్తావు. ఎపివా ఐ లైక్ టు సీ యూ ఇన్ శారీ"

" నా ఇష్టం వచ్చిన డ్రస్ వేసుకుంటాను మధ్యలో మీకేంటి?" అంది ఆమె.

" నాక్కాపోతే ఎవరికి కావాలి? నువ్వుచీరలోనే బావుంటావు"

"రవి!... మధూ!... రండి, వెనకపడిపోయారు" అని తండ్రి పిలవటంతో వాళ్ళ మధ్య మాటలు ఆగిపోయాయి.

చర్చిగేటుముందు సుధాకర కనిపించాడు.

"మి పేరెంట్స్ రాలేదుటోయ్" అడిగాడు పాల్ప్రభాకర్ అతన్ని.

"వెనక వస్తున్నారంకుల్"

"దిసీజ్ మిస్టర్ రవి. వర్క్స్ ఇన్ ఎలక్ట్రిసిటీబోర్డ్ ఏజ్ జూనియర్ ఇంజనీర్. మై టెనెంట్. సుధాకర్ – అసిస్టెంట్ సివిల్ సర్జన్ ఇన్ గాంధీహాస్పిటల్ సన్ ఆఫ్ మై కొలీగ్" అని పరిచయం చేశాడు పాల్ప్రభాకర్ ఒకళ్ళ, నొకళ్ళకు.


"గ్లాడ్ టు మీట్ యు" అని చెయ్యిచాస్తూ ముందుకొచ్చాడు సుధాకర్.

"మీ డాక్టర్లకు్కూడా దేవుడూ, దయ్యాలూ వుంటాయన్నమాట" అని నవ్వాడు రవి చెయ్యి కలుపుతూ.

"డాక్టర్లూ మనుషులేకదండీ! అందరికీ వుండే జ్ఞానమో, అజ్ఞానమో మాకూ కాస్తంత వుంటుంది."

"అవేం మాటలు చర్చికొచ్చి పదండి, పదండి లోపలికెళ్దాం" అంది మధుబాల తల్లి ప్రమీలాపాల్.

సుధాకర్ చామనచాయ. పొడుగ్గా ధృఢంగా వుంటాడు. ఎప్పుడూ నవ్వుతూ కనిపిస్తాడు. రెండుకుటుంబాల మధ్య చాలాకాలంగా సన్నిహితం వుంది. పైకెవరూ అనుకోలేదు కానీ, మధుకూ, సుధాకర్‌కూ ముడిపెట్టాలని రెం కుటుంబాల పెద్దలకూ వుంది. అయితే రాజును చూసిన కళ్ళతో మొగుణ్ణి చూసినట్టు రవిముందు సుధాకర్ తేలిపోయినట్టుంటాడు మధుబాలకు. రవిలో వున్న రాజసం, ఠీవి, అధికారపు గొంతు, తనుకావాల్సింది ఏమైనా లాక్కోవాలనే తత్వం ఆమెను ఆకట్టుకున్నాయి. ఎప్పుడూ అపోలజిటిక్‌గా వుండే సుధాకర్ ఆమెకు నచ్చడు. ఎంతోకాలంగా



పరిచయంవున్నా, 'నాకునువ్విట్లావుంటే బావుంటావు. నువ్విలా వుండు, ఇలా అలంకరణ చేసుకో' అని ఎప్పుడూ అనడు. 'వట్టి చచ్చు మంచివాడు' అని ఆమె అభిప్రాయం అతనివట్ల.

రవితో అంతగా పరిచయంలేని రోజుల్లో సుధాకర్, మధుబాల స్కూటర్ మీద సినిమాకు వెళ్తూంటే పక్కనుండి దూసుకుపోయాడో హీరో హోండా పెద్దమనిషి. అతడి బండి హాండిల్‌బార్ తగిలి క్లచ్ పట్టుకున్న సుధాకర్ ఎడమచెయ్యి గీరుకుపోయి, రక్తం రాసాగింది. అంత ట్రాఫిక్ వున్నరోడ్డు మీద రాష్‌డ్రైవింగ్ చేసే ఆ హీరో పై కోపం వచ్చింది మధుబాలకు. తనూ వాడిలా నడిపి, వాణ్ణి పట్టుకు ఉతికేయకుండా, బండిని మెల్లగా నడిపిస్తూ ఓ మెడికల్ షాపు ముందు ఆపిన సుధాకర్ మీద మరీకోపం వచ్చింది మధుబాలకు. 'ఇదేం మనిషి', మరీ ఇంత పిరికితనమా' అనుకుంది. అనుకోవటమే కాదు పైకే అంది.

"ఆ రాస్కెల్‌ను పట్టుకు ఉతకాల్సింది. ఇంత ట్రాఫిక్ రోడ్డులో అంత రాష్ డ్రైవింగా" అని.

"రాష్‌డ్రైవింగ్ పొరపాటే. అలా అని అతన్ని పట్టుకోవడంకోసం మనమూ రాష్ డ్రైవింగ్ చేయటం ఎంతవరకు మంచిపని అంటావు?" అన్నాడు.

"నువ్వెప్పుడూ ఇంతే. ఇలాంటి గాడ్దెలకు బుద్ధిలావస్తుంది?" అంది ఆమె.

"బావుంది. అందరికీ బుద్ధి చెప్పటానికే మనం పుట్టామా?" అన్నాడు సుధాకర్ మెడికల్ షాపులోకి వెళ్తూ.

షాపులో ఆయింట్‌మెంటూ, దూది, గాజుగుడ్డా కొని, రక్తాన్ని తుడిచేసి ఆయింట్‌మెంట్ రాని, దూది పెట్టి గాజుగుడ్డతో ఎడం అరచెయ్యిమీద కుడిచేత్తో కట్టుకుంటూ తిప్పలు పడ్డాడు కాని ఆమె సహాయం అడగలేదు.

'నేను సాయం చేసేదా?" అని అక్కడికీ తనే అడిగింది ఆమె...

"అక్కరలేదు. డాక్టర్లం మాకు అలవాటేగా." అన్నాడతడు.

తనను పెళ్ళచేసుకోవాలని అనుకుంటూన్న అతను, ఆత్మీయంగా తన సాయం ఎందుకు తీసుకోడు? 'గీరుకుపోయి మంటగా వుంది' అని కూడా అనకుండా నెప్పిని మౌనంగా భరించే మనుషులంటే విరాకు ఆమెకు.

'అబ్బ! బాగా నెప్పిగావుంది. కొంచెం ఈ ఆయింట్‌మెంట్‌రాసి, ఈ గాజు గుడ్డతో కట్టరాదూ, అలా చూస్తూ నిలబడపోతే' అని అతనన్నట్లయితే ఆమెకు తృప్తిగా వుండేది.

అతనికంటే రవి ప్రవర్తన నచ్చింది ఆమెకు. ఓసారి అతను తలనొప్పి వచ్చి పడుకున్నాడు గదిలో మధుబాల కాలేజీనుండి వస్తూనే రవిగది తలుపు తెరచివుంటే లోపలకు తొంగి చూసింది.

"ఎవరూ? మధూ..." అన్నాడతను ఆమెను చూసి.

"అవును. ఏం అలా పడుకున్నారు?"

"తలనొప్పిగావుంది గాని, మీ ఇంట్లో అమృతాంజనం వుందా?"

"లేదనుకుంటాను"

"పోని టేబ్లెట్సేమయినా వున్నాయా?"

"లేవనుకుంటాను? వేం తలనొప్పికి టేబ్లెట్లువాడం"

"మరేం వాడతారు? సరే కాస్తంత రోడ్డుమీద దాకావెళ్ళి అనాసిన్, ఆస్ప్రిన్ వట్రా. టాబ్లెట్‌తో పాటు కాఫీ కలిపిస్తే మంచిది. అన్నట్లు అమృతాంజనం సీసాకూడా ఓటి పట్రా" అన్నడతను.

అతని మాటల్లో అర్థంవు వుండదు. హక్కున్నట్లు డిమాంట్ చేస్తున్నట్లు అడుగుతాడు. ఆత్మీయుల దగ్గర అర్థించాల్సిన పనిలేదు. అడిగి చేయించుకోవాల్సిందే. అతని పద్ధతి ఆమెకు నచ్చింది.

తలనొప్పి మాత్రలు, అమృతాంజనం కొని తీసుకువచ్చింది. తల్లికి చెప్పి కాఫీ కలిపించివేడివేడి కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది. తలనొప్పి బాధకు అతను మూలుగుతున్నాడు.

"కొంచెం అమృతాంజనం నుదిటికి పట్టించి రుద్దరాదూ?" అన్నాడు.

"అమ్మో ఎవరయినా చూస్తే ఏమనుకుంటారు?" అంది ఆమె భయపడ్తూ.

"ఏమనుకోరులే రాయి"

"నావల్లకాదు బాబు! మీరే రాసుకోండి" అని ఆమె వెళ్ళిపోయింది.

అలా చెప్పిన మాట వినకుండా ఆమె వెళ్ళిపోయినందుకు అతనికి కోపం వచ్చింది. మర్నాడు ఎవరూ లేకుండా చూసి, ఆమెను గదిలోకి పిల్చి, 'మొద్దూ! తలనొప్పిగా వుంది. అమృతాంజనం నుదుటికి రాయమంటే వినిపించుకోకుండా వెళ్లిపోతావా?" అని తలమీద మెట్టికాయవేశాడు. ఆదెబ్బ ఆమెకు చల్లగా, హాయిగా తగిలింది.

బావుంది. నువ్వుకట్టుకున్న భార్యనా, ఏపనిబడితే ఆపనిచేయటానికి" అని ఆమె అడగ లేదు.


"ఎవరయినా చూస్తే బావుండదు" అని మాత్రం అనగలిగింది ఆమె.

"అలాంటప్పుడు గదితలుపు వేసి రాయాల్సింది" అన్నాడతను.

"ఛీ, పొండి" అని వెళ్ళిపోయిందామె.

అలా అధికారం చెలాయించే మొగవాడంటే ఆమెకు మక్కువ.

తన షెల్వార్, కమీజ్‌ల మీద రవి వ్యాఖ్యానం చేసినప్పటినుండి, వాటిని



తొడుక్కోవటం మానేసింది. "ఏవిటే, ఆగుడ్డలసలు వాడటంలేదు" అని తల్లి అడిగితే, "నాకూ అవి బావుంటంలేదమ్మా. చీరలే బావుంటాయి. ఇహనుండి చీరలే వాడ్తాను" అంది.

"అదేవిటే? చక్కగా వున్న గుడ్డలు, పైగా కొత్తవి, మోజుపడి కొనుక్కున్నవి, వేసుకోనంటావు" అంది తల్లి.

"నాకిప్పుడు బావుండటం లేదమ్మా అవి" నాన్సీ వేసుకుంటుందిలే వాటిని" అంది ఆమె

రవివట్ల ఆరాధన షెల్వార్స్, కమీజ్‌లతో ఆగలేదు. ఓరోజు పొద్దున అతని గది దాటి కాలేజీకి వెళ్తుంటే "మధూ!" అని పిల్చాడతను.

"ఏంటి?" అని ఆమె వెనక్కి తిరిగి గదిలోకి వచ్చింది.

'ఓసారి నీముఖం అద్దంలో చూసుకో" అన్నాడతను.

"ఏం? ఏమయింది?" అని అక్కడేవున్నా అద్దాన్ని తీసుకుని, బుగ్గలమీద పౌడరు ఎక్కువగా వున్నట్లుంటే చేతితో సరిచేసుకుంటూ ఏంవుంది, నా మొహం మీద? ఏంలేదే" అంది.

"ఇప్పుడు చూడు అద్దంలో" అని వెనగ్గా వచ్చి మామిడిచిగురు రంగు బిందియా ఒకటి ఆమె నుదిటిన అంటించాడు.

"ఛీఛీ ఇదేంటి? మేం క్రిష్టియన్లం. బొట్టు పెట్టుకోం" అని తీసేయబోయింది.

"వుండు తీసేయకు. అది పెట్టుకుంటే నీముఖానికెంతకళ వచ్చిందో తెల్సా. అద్దంలో చూసుకో ఎలావున్నావో" అన్నాడు అతను.

ఆమె అద్దంలో తనముఖం చూసుకుంది. అతనన్నట్లు తనముఖం కళగా అందంగా అన్పించింది.

"ఇప్పుడెలావున్నావో తెల్సునా, అప్సరసలావున్నావు" అని ఆమె దగ్గరగా వచ్చి భుజంమీద చెయ్యేసి దగ్గరకు లాక్కుని బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాడు.

"ఛీ, ఛీ, ఇదేం పాడుపని. ఎవరయినా చూస్తే " అంది ఆమె అతన్నుండి దూరం జరుగుతూ.

"చూడకపోతే ఫరవా లేదన్నమాట"

"ఛీ, పో.." అని బయటకడుగేస్తూ నుదుటిమీద బిందియా తీసేసింది.

కాలేజీలో అన్యమనస్కంగా వుండిపోయింది ఆమె. మనస్సంతా రవిచుట్టూనే పరిభ్రమిస్తోంది. క్లాసులో పాఠాలు ఆమెబుఱ్ఱలోకి జొరబడలేదు. చివరకు విసుగనిపించి క్లాసులెగ్గొట్టి ఇంటి కొచ్చింది. వస్తూ, ముందుగదిలో రవి ఉన్నాడా అని చూసింది. లేడు, ఆఫీసుకెళ్ళాడు.

"ఏవిటే, అప్పుడే వచ్చావు కాలేజీనుంచి" అని అడిగింది తల్లి.

"తలనొప్పిగా వుందమ్మా! కాసేపు పడుకుంటే అదే తగ్గిపోతుంది." అని భుజాన బాగు ఓమూల పారేసి బెడ్‌రూంలోకి వెళ్ళి మంచంమీద పడుకుంది. ఎన్నో ఆలోచనలు రాసాగాయి. "రవి, రవి, రవి" అని అతని నామజపం చేసింది. దిండుపైకి వేసుకు కూర్చుని ఓ కాయితం మీద పెన్నుతో 'రవి, రవి' అని రామకోటి రాయసాగింది. ఓపేజీ నిండిపోయింది. అప్పుడు స్పృహలోకి వచ్చిన మధుబాల 'ఛీ! ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు?' అనుకుంది. కాయితాన్ని చింపటం ఇష్టంలేక పదిలంగా కవబోర్డులో తన చీరెల అడుగున దాచుకుంది. పొద్దున అతను బొట్టుపెట్టటం, చుంబించటం మనసులో మెదిలాయి. వెర్రి ఆనంద పారవశ్యంలో మునిగిపోయింది ఆమె. అతని వేళ్ళు తాకిన తననుదుటి భాగాన్ని, బుగ్గను మృదువుగా చేత్తోరాసుకుని వేళ్ళను ముద్దుపెట్టుకొంది. బుగ్గలు ఎరుపెక్కి వేడి ఆవిర్లు వచ్చాయి విచ్చెక్కినట్లయింది ఆమెకు. డ్రస్సింగ్‌టేబిల్ ముందు నిలబడి అద్దంలో ముఖం చూసుకుంది. ఇంట్లో బొట్టుపెట్టుకునే ప్రశ్నే లేదు కాబట్టి తిలకం, కుంకమలాంటివి వుండవు. అద్దంలో చూసుకుంటూ నుదుటిన పెన్నుతో గుండ్రంగా బొట్టు దిద్దసాగింది.

స్కూలు నుండి వచ్చిన నాన్సీ అక్కచేసే పని చూసి "అదేంటి, హిందువుల్లా బొట్టు పెట్టు కుంటున్నావు?" అని అడిగింది.

"బొట్టు హిందువుల సొంతమా? మనమూ ఎందుకు పెట్టుకోకూడదు? అది ఒట్టి అలంకరణ మాత్రమే. వాళ్ళూ చీరలు కడ్తున్నారు. మనమూ కడ్తున్నాం. అలాగే ఇదీ. తప్పేంవుంది?" అంది మధుబాల.

ఆపిల్లకు అక్క లాజిక్ అర్థంకాలేదు.

"మమ్మీ! అక్క బొట్టు పెట్టుకుంటోందే" అని అరిచింది గదిలోనుండే .

"అదేంపనే పెద్దమ్మాయి? మనమతానికి విరుద్ధంగా ఆ బొట్టేంటి? చెరిపెయ్యి" అంది.

చెల్లెలిదగ్గర వుపయోగించిన లాజిక్ తల్లిదగ్గర పనిచేయదని ఆమెకు తెల్సు. అందుకని ముఖం కడుక్కుని వచ్చింది. అయితే తల్లికి భయపడి ఇంట్లో బొట్టుపెట్టకోవడం మానేసింది కాని, ఇంట్లోనుండి బయట పడిన తరువాత, తన హాండ్ బాగ్‌లోనుండి బిందియా తీసి నుదిటిన అంటించుకోసాగింది.

రవిపట్ల ప్రేమలో పీకల వరకు దిగబడిన మధుబాల చదువునశ్రద్ధ చేయసాగింది. రెండో ఏటి పరీక్షల్లో రెండు సబ్జక్ట్ లు తప్పింది.

"మధుకి చదువుమీద శ్రద్ధతగ్గింది. పెళ్ళి చేసేస్తే మంచిది" అంది తల్లి రిజల్ట్సు వచ్చింతరువాత తండ్రితో.

"గ్రాడ్యుయేషన్ కానీ చూద్దాం" అన్నరాయన.

"దీని నడక చూస్తుంటే ఆ చదువు పూర్తి చేసేట్లు కన్పించటంలేదు" అంది ఆమె.

"అదేం?"


"ఏమో ఎప్పుడూ కూనిరాగాలు తీసుకుంటూ, పక్కమీద పడుకుండటమే కానీ, పుస్తకం తెరిచిన పాపాన పోవటంలా"

"ఆ చిన్నతనంలే, అదే చదువుకుంటుంది."

"ఇంకేం చిన్నతనం. ఆసుధాకర్ తల్లిదండ్రులతో సంబంధం విషయం కదిలించరాదూ!"

"అలాగే" అన్నాడాయన.

మధుబాలకి సంభాషణ విన్నప్పటి నుండి భయంగా ఆతృతగా వుంది, తల్లిదండ్రులు తన మనసు



తెలుసుకోకుండా, మాట వినకుండా ఎక్కడ సుధాకర్‌కి కట్టబెట్టేస్తారోనని. ఎలాగో కష్టపడి సప్లిమెంటరీ పరీక్షల్లో తప్పిన సబ్జెక్టులు పాసయింది. రవిలేక తను క్షణంబతుక లేదు. అతనితోడిదే తనబతుకు. అతన్ని పెళ్ళి చేసుకోవాలి. అతని అర్ధాంగై, అతని పిల్లలతల్లిగా ఊహించుకుంటూ మురిసిపోయేది. సంక్రాంతికని నాలుగు రోజులు శలవుపెట్టి తమ ఊరువెళ్ళిన రవి, ఎప్పుడు తిరిగి వస్తాడా అని కళ్ళు కాయలు కాచేట్టు ఎదురుచూసింది ఆమె. అతను వచ్చాడు. వస్తూ, వస్తూ తనకు మొగలి రేకులు తెచ్చాడు. మొగలి రేకుల్లాంటి మగవాడతను, మొగుడయితే.. ఈ ఆలోచనలో ఆమె బుగ్గలు ఎరుపెక్కాయి.

"ఏవే మధూ!.. ఎంతసేపు బాత్‌రూంలో. గంటయింది బాత్‌రూంలో దూరి. బయటకురా" అంటూ అరుస్తున్న తల్లి గొంతుకకు ఉలిక్కిపడి ఊహాలోకంనుండి ఇహలోకానికొచ్చింది మధుబాల. త్వరత్వరగా చీరె చుట్టుకుని బయటపడింది.

అతనితో మాట్లాడి పెళ్ళి విషయం తేల్చాలి అని ఆలోచిస్తోంది ఆమె. ఓరోజు సాయంత్రం ఇంట్లో వాళ్ళందరూ బంధువుల ఇంటికి పార్టీకి వెళ్తూంటే, ఒంట్లో బావుండలేదని చెప్పితను ఇంట్లోనే వుండిపోయింది.

సాయంత్రం రవి తాళం చెవుల రింగ్ చేతిలో పట్టుకుని, చెయిన్ని గుండ్రంగా వేలిచుట్టూ తిప్పుకుంటూ వచ్చాడు తనగదికి. బయట నిలబడ్డ మధుబాలని చూసి, "హలో! నువ్వెళ్ళలేదా పార్టీకి" అన్నాడు ఆమెని పలకరిస్తూ.

"వెళ్ళలా"

"సరేరా, నాగదిలో కూర్చుందాం" అన్నాడతను.

గదిలో కుర్చీలో కూర్చుంది ఆమె. అతను గుడ్డలు మార్చి లుంగీ కట్టుకుని బెడ్‌మీద నడుం వాలుస్తూ 'ఆ సిగరెట్‌పెట్టె, అగ్గిపెట్టె ఇలా ఇవ్వు' అన్నాడు.


ఆమె టేబుల్ మీదనుండి వాటిని తీసి ఇచ్చింది. అతను సిగరెట్టొకటి నోట్లో పెట్టుకుని, "ఊ వెలిగించు" అన్నాడు. ఆమె అగ్గిపుల్లగీసి వెలిగించింది.

"ఏంటలా కాలంవృథాచేస్తూ మూగనోము పట్టికూర్చున్నావు? ఏమైనా మాట్లాడు" అన్నాడు అతను సిగరెట్ పొగ వదుల్తూ.

ఆమెకి విషయం కదపాలనేవుంది. ఎలాగో తెలియటంలా.

"కాఫీ తెచ్చేదా?" అంది.

"అక్కర్లా, తాగే వచ్చాను. సరే, ఈ ఎఱ్ఱ రంగు చీర ఎక్కడ దొరికింది నీకు? డేంజర్ కలర్. మొన్న కట్టుకున్నావు చూడు బంగారు వన్నె చీరే. అది కట్టుకురాపో" అన్నాడతను.




"ఏ చీరయితే ఏం లే" అంది ఆమె లేవకుండా.

"అరె వెళ్ళి రమ్మంటే. కట్టుకురాపో"

ఏం? ఈ చీరెలో బావుండనా నేను?"

"బానే వుంటావుకానీ, ఆ చీరెలో అయితే ఇంకాబావుంటావు. ముద్దొస్తూ వుంటావు. అసలు చీరే లేకపోతే ఇంకా ఇంకా బావుంటావు"

"ఛీ పో" అంది ఆమె.

అతను సిగరెట్ పీక మూలకి విసిరేసి, తలుపు గడియవేసి వచ్చాడు.

"తలుపెందుకేశావు?"

"ముద్దుపెట్టుకోటానికి, జస్ట్ ఎ బిట్ ఆఫ్ రొమాన్స్"

"అవ్వేం కుదరవు"

"ఎందుకు కుదరవు" అంటూ ఆమెను మంచమీదకులాగి, కౌగిలించుకుని గాఢంగా చుంబించాడు రవి.

మధుబాల అతన్ని కాదనలేదు. ఏదో తన్మయస్థితిలోపడిపోయింది. శరీరాలు పెనవేసుకుంటున్నాయి. ఉద్రేకం తారస్థాయిలోవుంది. రవి ఆమె జాకెట్‌హుక్‌లు తీసేస్తున్నాడు. ఈ లోకంలో లేని మధుబాల అభ్యంతర పెట్టలేదు. ఎక్కడెక్కడో తడిమేస్తున్నాయి రవి చేతులు. ఆమె స్పృహకోల్పోయింది.

ఇంతల్లో బయటనుండి 'పోస్టమన్' అన్న కేకవినపడి, ఓ ఉత్తరం తలుపుసందులో నుండి గదిలో పడింది. ఆ అరుపుతో ఆమె చేతనావస్థకు వచ్చింది.

"ఏంటి? ఏం చేస్తున్నావు. వదులు నన్నొదులు" అంది ఆమె గాబరాగా.

"నీకు తెలీదా ఏం చేస్తున్నానో, నీకు మాత్రం అవసరం లేదా ఈ అనుభవం" అన్నాడతను ఇంకా ఆమె శరీరాన్ని తడుముతూనే.

"పెళ్ళి కాకుండానే నాకెలాంటి అనుభవమూ వద్దు" అంది ఆమె అతన్ని వదిలించుకుని లేచి కుర్చీ దగ్గరకు వెళ్తూ.

"అదేంమాట. నాకు తెల్సు. నీకు కావాలి. రా టైం వేస్ట్ చేయకు.

"రవీ ఓ మాట చెప్పు. మనం పెళ్ళెప్పుడు చేసుకుందాం?"

"మనం పెళ్ళి చేసుకుందామన్నానా నేను?"


"అంటే నన్ను పెళ్ళి చేసుకోవా?"


"ఎలా? నువ్వు క్రిస్టియన్‌వి. నేను సనాతన ఆచారపరుల కుటుంబంలో పుట్టిన హిందువుని, మనపెళ్ళెలాగవుతుంది?"

"ఎందుకు కాదు? ఈ మతాలు, కులాలు మనం కల్పించుకున్నవేగా. అవి అడ్డంకికాదు మన పెళ్ళికి"

"మరి మీ వాళ్ళు ఒప్పుకుంటారా?"

"వాళ్ళొప్పుకున్నా, లేకున్నా నే లెక్కచేయను"






"కాని మావాళ్ళు ఇలాంటి మతాంతర, కులాంతర వివాహానికంగీకరించరు. వాళ్ళమాటలు నేను లెక్క చేయాల్సి వస్తుంది."

అంటే నన్ను పెళ్ళి చేసుకోవా?"

"అబ్బ! పెళ్ళి, పెళ్ళి అని సతాయించక. లెట్స్ ఎంజాయ్. టైమ్ ఫాస్ట్ మూవింగ్" అన్నాడు అతను ఆగలేక ఆమె చెయ్యి పట్టుకులాగుతూ.

ఆమె అతని చెయ్యి విదిలించికొట్టింది.

"అయితే ఇదంతా ఎందుకుచేశావు? నాలో ఆశలు ఎందుకురేపావు."

"బావుంది. తప్పంతా నాదే అన్నట్లు మాట్లాడుతున్నావు. ఆడామగా ఒకరిపట్ల ఒకరికుండే ఆకర్షణ సహజం. నువ్వు పెళ్ళికి పట్టుబడ్తావని నేననుకోలేదు. నీలాంటి ఫాషనబుల్ ఎడ్యుకేటెడ్ గాళ్ కూడా ఇలా ఛాందసంగా ఆలోచించటం బాగలేదు. రా, దగ్గరకురా, మొరాయించకు" అన్నాడతను.

అప్పుడప్పుడే ఆమెకు కనువిప్పు కలుగసాగింది.

"అంటే ఫాషనబుల్, ఎడ్యుకేటెడ్ గాళ్స్ అందరూ పెళ్ళికాకుండానే అనుభవానికి తహతహలాడతారని నీ. ఉద్దేశ్యం?"

"అందరిసంగతి నాకు తెలియదు. నీ సంగతంతే. నాకూ ఏమీ అభ్యంతరంలేదు. లెట్స్ ఎంజాయ్ ఫర్ టైం అండ్ ఫర్గెటిట్. జస్ట్ ఎ బిట్ ఆఫ్ రొమాన్స్ లేకుండా బ్రతికేం ప్రయోజనం"

ఆమె లేచింది.

'ఇప్పు డర్థమయింది నాకు నువ్వేలాంటివాడివో. పెళ్ళికి మతం అడ్డుకాని, అనుభవానికి అభ్యంతరం లేదు. నీ కభ్యంతరం లేకపోయినా నాకుంది. నాకలాంటి రొమాన్స్ అక్కరలేదు. ఇహనువ్వెప్పుడూ నన్ను పలకరించకు, నావంక చూడకు. ఐ కాంట్‌ఫర్గెట్‌యు, బట్ ఐ షల్ ట్రై టు స్మోరర్ ఎనీథింగ్ స్వీట్ ఇన్ యువర్ మెమరీ. గుడ్‌బై" అని బయలుదేరింది ఆమె.

"ఎక్కడకు పోతావు? ఇవాళకాకాపోతే రేపయినా నా చేతిలోకి వచ్చేదానివే. నీ సంగతి నాకు తెలిదా?" అన్నాడు అతను వెకిలిగా ఆమెవంకచూసి నవ్వుతూ.

మధుబాల గడియతీసి, ధామ్మని తలుపేసి అతని గదిలోనుండి బయటకొచ్చేసింది. ఇంటి తలుపులన్నీ బిగించుకుని ముఖం మీద దిండు పెట్టుకుని కుమిలి కుమిలి ఏడ్చింది.

ఆ తరువాత రవి ఆమెని వదలలేదు. ఆమెను తన దారిలోకి తెచ్చుకోటానికి ఎంతో ప్రయత్నించాడు.





ఆమె అతనిని చూడటం, మాట్లాడటం మానేసింది. చిత్రంగా ఆమెకి అతనిపట్ల కోపం కలగలేదు. అతను పలకరిస్తే నిగ్రహించుకోలేక సతమతమై పోయేది. రవికి ఆ ఊరినుండి ట్రాన్స్‌ఫర్ కావటంతో ఓవిధంగా ఆమె సమస్య పరిష్కరింపబడినట్లయినా, ఆమె అతన్ని మర్చిపోలేక పోయింది. అతని తోడిదే తన జీవితం అనుకుంది. అతను కాదన్నా తను అతని భార్యే, అతని స్త్రీయే, తన శరీరం, మనసు అతడివే. వాటిని మరొకరికి అర్పించలేదు తను. బ్రహ్మచారిగా జీవితాంతం వుండిపోతుందితను.

అయితే కూతురువడే ఈ అంతర్మథనాన్ని గుర్తించని తల్లిదండ్రులు ఆమెపెళ్ళిచేయ నిశ్చయించారు. సుధాకర్ తల్లితండ్రులు కూడా ఈ పెళ్ళకంగీకరించారు. మొదటి నుండి ఒకరికొకరు పరిచయమున్నలేకాబట్టి పెళ్ళిచూపులు తతంగంలేదు. మధుబాలకీ పెళ్ళి ఇష్టం లేదు. తను సుధాకర్‌ను పెళ్ళి చేసుకుంటే మానసిక వ్యభిచారమవుతుంది రవితోడి తన ప్రణయమంతా తన హృదయంలో భర్తగా ప్రతిష్ఠించుకున్న రవికి కాక మరొకరికి తనతనువెలా అర్పించగలదు? తల్లిదండ్రులతో తనకిపెళ్ళి ఇష్టం లేదని చెప్పి ప్రయోజనం లేదు, అందువల్ల సుధాకర్‌తోనే ఈ విషయం చెప్పాలని నిర్ణయించుకుంది మధుబాల. అతన్ని తమ ఇంటికి రమ్మని ఫోన్ చేసింది. "రేపు క్రిస్‌మస్ కదా గ్రీటింగ్స్ చెప్పటానికెలాగో వస్తాను. అప్పుడు మాట్లాడుకుందాంలే" అన్నాడు సుధాకర్.


క్రిస్‌మస్ సందర్భంగా ఇంట్లో హడావుడిగావుంది. అయితే మధుబాల మనస్సే రోదిస్తోంది. "రేపు జీసస్ పుడతాడు. ప్రపంచానికి పాపాన్నుండి విముక్తి లభిస్తుంది కాని, తన జన్మకి విముక్తి లేదు" అనుకుంది ఆమె.

మర్నాడు సాయంత్రం సుధాకర్ వచ్చాడు ఆమె ఇంటికి, చేతిలో పెద్దపొట్లంతో. కాబోయే భార్యకు ఏదో క్రిస్‌మస్ గిఫ్ట్ తెచ్చాడనుకున్న పెద్దలు అది ఏమిటి అని అతన్నేమీ అడగలేదు. సుధాకర్ని డాబాపైకి తీసుకెళ్ళింది మధుబాల.

"మెర్రీ ఎక్స్ - మాస్" చెప్పాడు సుధాకర్

ఆమె తిరిగి అభినందనలు చెప్పింది.

"ఏం మధూ! ఎందుకంతడల్‌గా వున్నావు. నీ పరీక్షలయ్యాకే పెట్టుకుంటే



బావుంటుందని చెప్పా పెళ్ళి. ఏమంటావు?" అన్నాడు సుధాకర్

మధుబాల మాట్లాడలేదు.

"వింటున్నావా?
ఏమాలోచిస్తున్నావు?"

"ఈ పెళ్ళి ఇష్టం లేదని ఎట్లా చెప్పాలా అని"

"ఏంటీ?" ఆశ్చర్యపోతూ అన్నాడు సుధాకర్

"ఔను సుధాకర్! నామీద నీకేపాటి స్నేహభావమున్నా, నామాటంటే నీకేపాటి విలువున్నా ఈ పెళ్ళికి ఒప్పుకోకు, ఇంకెవర్నయినా చేసుకో ప్లీజ్!"

"ఏం, నే నచ్చలేదా?"

"అది కాదు, నాకు వేరే కథవుంది.?"

"కథా, కాకరకాయా, హాస్యం చేయకు"

"నా జీవితమే హాస్యాస్పదమై పోయింది. ఇంక నేనే హాస్యమాడ్తాను.

"ఏం భారీ డైలాగులు చెప్తున్నావు విషాదం చాల్లే, విషయానికిరా" నవ్వాడు సుధాకర్.

"ప్లీజ్ సుధా! నన్నేం అడక్కు, నేనేం చెప్పలేను."

"చెప్పలేవా, చెప్పకూడదా?"

"ఏమైనా అనుకో, నా పరిస్థితి అది"

"ఏవిటో ఆపరిస్థితి. కాస్తంత వివరంగా చెప్పొచ్చుగా. నేనేం నిన్ను బలవంతంగా పెళ్ళి చేసుకోనులే చెప్పు"

"నేను రవిని ప్రేమించాను..." అంటూ మొదలుపెట్టి మెల్ల మెల్లగా తన కథంతా చెప్పింది మధుబాల. ఇంకా చెప్పింది. "నన్నొదిలినా అతడే నాప్రియుడు, నాభర్త."

"దట్స్ గుడ్, అయితే ఏం చేద్దామనుకుంటున్నావు?"

"ఏముంది చేయటానికి? నేనింక. జీవితంలో పెళ్ళి చేసుకోను."

"భేష్ బాగుంది. అదేనా పరిష్కారం?"

"మరేం చేయాలి? అతన్ని మర్చిపోలేను. అతను గుర్తున్నంతవరకూ ఈ తనువూ, మనసూ ఇంకెవ్వరికీ అర్పించలేను."

"నిన్నెవరు మర్చిపోమన్నారు?"

"అతని జ్ఞాపకాలతో బతుకుతూ ఇంకోర్ని ఎలా చేసుకోను?"

"ఇదంతా ట్రాష్. నీకంటూ ప్రేమించే మనసున్నప్పుడు, రేపు నన్నూ ప్రేమిస్తావు."

"స్టాపిట్ - సుధా! అట్లా మాట్లాడకు. ఇంకెవర్నీ ప్రేమించలేను. ఒకవేళ ప్రేమించాననుకుంటే అది భ్రమ."

"భ్రమా... జీవితంలో ఎన్ని భ్రమలు తొలగిపోవాలో. అయినా నీ మనసంత సంకుచితమా?" ఇల్లు ఇరుగ్గావున్నా ఫర్లేదుగానీ, మనసు మాత్రం విశాలంగా వుండాలి" అన్నాడు నవ్వుతూ సుధాకర్.

మధుబాల వెక్కివెక్కి ఏడవసాగింది. సుధాకర్ ఆమె కన్నీళ్ళు తుడుస్తూ "ఏడవకు. ఇప్పుడేమైందని ఇందులో వింతా విడ్డూరం ఏమీ లేదు. ప్రతిదాన్నీ భూతంలా ఊహించుకుని భయపట్టం మంచిదికాదు. అన్నిట్నీ తేలిగ్గా తీసుకోవటం నేర్చుకో" అన్నాడు.

మధుబాల ఏడ్పు ఆపలేదు." ఇది చిన్న విషయమా?" అంది అలాగే వెక్కుతూ.

సుధాకర్ చెప్పసాగాడు.

"సాన్నిహిత్యం, మనం మెచ్చే లక్షణాలున్న వున్న వ్యక్తి పట్ల అనురాగాన్నేర్పరుస్తాయి. దీని ప్రేమనుకో, మరేమయినా అనుకో. జీవితంలో ఎన్నో కాంపొనెంట్స్. అందులో ఏ ఒకటీ సంపూర్ణం కాదు. ఎవరోకవి చెప్పినట్టు షడృతువులు కలిస్తేనే సంవత్సరమవుతుంది. అయితే ఏ ఒక్క ఋతువూ సంవత్సరంకాదు."

ఓ మనిషి పట్ల ప్రేమే సర్వస్వం కాదు. ఇంకా వుంది జీవితం...."

ఓ క్షణమాగాడు సుధాకర్. పక్షులు గూళ్ళు చేరుకుంటున్నాయి. చిరుచలిగాలి వీస్తోంది. మళ్ళీ చెప్పసాగాడు అతను.

"మనసున్నప్పుడు స్పందన సహజం. నీవు మెచ్చేవాటికి స్పందించటం సహజం. నువ్వు మెచ్చిన రవిని ప్రేమించకపోయినట్లయితే అది నీలో లోపమవుతుంది. స్పందన, ఆర్ద్ర భావంలేని జీవితమేం జీవితం? నీ మనసు అతని పట్ల మొగ్గు చూపింది. అతను స్పందించలేదు. వెళ్ళిపోయాడు. అందుకని మనోపుష్పపు దళాల్ని తిరిగి ముకుళింపచేసుకుని, ఇతరులెవరూ ఆ సుగంధాన్ని ఆస్వాదించరాదనటం నేరం. నువ్వు చేసింది తప్పుకాదు, చేయబోయేది తప్పు."

"నా కన్నీళ్ళు తుడవడానికి నన్ను సమర్థించకులే" అంది ఆమె. అప్పుడప్పుడే తెరపిన పడ్తోంది ఆమె.

"నేనలా పైపై కబుర్లు చెప్పను. ఆ విషయం నీకూ తెల్సు. నీ మానస వీణపై రాగం మార్చు. కొత్త గీతం ఆలాపించు. దానికి సబ్జెక్టని నేనే."

"నా మానస వీణా తంత్రులెప్పుడో తెగిపోయాయి."

"అదే నిజమైతే నువ్వింత సున్నితంగా ఆలోచించవులే. ఇదిగో నాక్రిస్మస్ గిఫ్ట్" అని పొట్లాన్ని విప్పి, డాబా పిట్టగోడ మీద పెట్టి, దోసెళ్ళతో మల్లెపూలు ఆమె తలపై పోశాడు సుధాకర్. ఓ పూవు ఆమె తలలో తురిమాడు.

"ఇదేవిటి?" అంది ఆమె.

"నేను నిన్ను వరించాను. నీకు తొందరేంలేదు. నీకు వీలైనపుడు మొదలెట్టు. అయితే మన పెళ్ళి మాత్రం ఖాయం. పద వెళ్దాం" అంటూ ఆమె భుజం మీద చెయ్యేసి ముందుకు నడిపించాడు సుధాకర్.

మధుబాల మనసు ఆర్ద్రమయింది. మల్లెపూల సువాసన మృదువుగా మనసును తాకుతోంది. మొగలిరేకంత గుబాళించలేదీ పరిమళం. మేనికీ, మనసుకీ హాయిని గొల్పే సుతారపు సౌరభం. అయినా గుచ్చుకునే మొగలిరేకు సాంద్ర పరిమళం మరపురానిది. పొదలో మిన్నాగు లేకపోతే అదీ పారిపోవాల్సిన సురభిళపరిమళం కాదు.

* * * *

